సాధారణంగా మనం ఒకరహస్యాన్ని బహిర్గతంచేసినా, ఒకపొరపాటుచేసినా సమాధానం చెపుతూ "అతను ఏమీ అనుకోనేవాడుకాదు" అంటాం. అంటే సంకల్పంలేనివాడని గాదు, దుష్టసంకల్పంలేకుండ కార్యఫలాన్నిబట్టి కర్తవ్యాన్ని నిర్ణయించేవాడేగాని, కార్యాసక్తుడై ఆదుర్దాతో యోచించకుండా "అనుకోవడం" అంటూ అతనిలో ఉండదని తాత్పర్యం.

మనం లోకంలో ఏదిఅనుకొన్నా ఏమిఫరవాలేదు. ఒక చిన్నరహస్యం ఇందులోఉంది. తానే విషయంలో ఏమనుకున్నా సరేగాని దాన్నిగూర్చి ఇతరులేమనుకుంటున్నారో ఆలోచించడం నేర్చుకొంటే ఎప్పుడూ ప్రమాదాలురావు. తాను "అనుకోవడం" జరిగేముందు, బయటనుండి తనకెదురుగ ఉన్న సంఘంలో ఏమి "అనుకోవడం" జరుగుతుందో గ్రహించుకొంటే అహింసాసూత్రానికి అందుకోవచ్చు. అయితే ఆదర్శప్రాయాలైన ఉత్తమ ఆశయాలను అందుకోవాలని "అనుకోవడం" ప్రమాదంకానేరదు. మనం అనుకోందీ, సంకల్పంలేనిది ఏపనిచెయ్యలేం. సంకల్పశుద్ధిఉంటే ఫలితంబద్ధమై ఉంటుందని అనుభవములో చూస్తున్నాం. మహావీరులు, నాయకులు, త్యాగధనులై యశఃకాయులైన వారంతా ఒకానొకప్పుడు సత్సంకల్పాలను అనుకొని ఆదర్శాలను "అనుకోవడం" జరిగి మననంచేసి తమ జీవిత సరస్వాలను అర్పించి పునీతులైనారు. మన భావి యువకులంతా మహోన్నతమైన పదవి కావాలని "అనుకోవడం"లో తప్పులేదు. నాలో భారత దేశానికి ప్రెసిడెంటు కావాలని "అనుకోవడం" ఉంది. నా "అనుకోవడం"లో ఎంతశుద్ధి, బలం ఉంటే నేనంత నిగ్రహంతో నా అనుకోవడాన్ని పొందేందుకు మార్గం సదుపాయం ఆలోచిస్తా. ఆలోచనే కాదు ఆచరణ యోగ్యమైన ప్రాథమిక ధర్మాలను నిర్వర్తిస్తాను. అందువలన మనం "అనుకోవడం"లోని అనుమానాలను వదలివేసి లక్ష్యాలను ఆదర్శాలను "అనుకోవడం" నేర్చుకొంటే మంచిదేమోనని అనుకొంటున్నాను. మీ రేమని అనుకొంటారో.

కథానిక

# వాడిపోని వాత్సల్యం

వసంతలక్ష్మి

ఏ స్నేహితుని యింటినుంచో తిరిగివచ్చి, రెండో వాటాలోకి వెళ్ళిపోతున్న మరిదిని, "రానాయనా! భోంచేద్దువుగాని. వెధవహోటలు మెతుకులెన్నాళ్లు తింటావు" అని ఆశగా కళ్ళలోకి చూచిన ఉమ కళ్ళవెంబడి శోకం సుడులు తిరిగింది. ఎంత తిరస్కారంగా అన్నాడు "ఊహు" అని!

కాళ్లు విరిగినట్లక్కడే కూర్చుండిపోయింది. జరిగిన సంఘటనలన్నీ సినిమాతెరమీద కనపడినట్లు కండ్లకు కట్టడం ప్రారంభించాయి.

* * *

అవి తన అత్తగారు టి. బి. తో బాధపడుతున్న రోజులు. అదెంత పాపిష్టికాలం? ఉమకు ఆ రోజులలోని అత్తగారుపడే వ్యాధిబాధ జ్ఞాపకము రాగానే గుండెలలో చేయిపెట్టి కెలికినట్లయింది. రక్తం నీరుగామారి కండ్లనుండికారింది. ఉన్న ఊరిలోనే శానిటోరియం ఉండటంచేత వేరేచోట ఆవిడను పెట్టవలసిన అవసరంలేక, కండ్లతో ఆబాధ చూడవలసి వచ్చింది. ఉమ అప్పటికి బొత్తిగా చిన్నది. కాపురానికి వచ్చిన క్రొత్త. వెనక పెద్దతోడు యిలాగ మంచం పట్టడంతో యింటియాతనంతా ఉమనే చుట్టుకుంది.

కృష్ణుడికప్పుడు నాలుగోయేడు. అతని సంరక్షణభారం ఉమదే. అమ్మ జబ్బుతో వుండటం వల్ల, అస్తమాను వదినతోటే తిరిగేవాడు. అందువల్లే ఉమకారోజులు కొద్దిగా సంతోషంగా గడిచాయని చెప్పొచ్చును. ఇలాగ వదినా మరుదులకు అన్యోన్యమేర్పడింది. ఆ రోజులు జ్ఞాపకం

రాగానే ఉమకు మళ్ళీ మరిది అప్పటిలాగే చిన్న బిడ్డడై తనతో ఆడగూడదా అనేభావం అంకురించింది. కండ్లనీరు కుండలోని పాలలాగ పొంగేయి. తనవదినగారు అప్పుడప్పుడు వచ్చిచూచి వెళ్ళేది. కాని, యిదంతా ఉమవల్ల వచ్చినదేనని దెప్పి పొడిచేది.

ఆరోజు తన అత్తగారి అంత్య ఘడియలు. కృష్ణుడు తల్లి గుండెలమీద వున్నాడు. ఇల్లంతా శోకతిమిరం మహాసముద్రం లాగు వ్యాపించి వున్నది. వదినె, వారి అన్నగారు తల్లిని గురించి బెంగటిల్లిపోయి కదలా మెదలా లేని స్థితిలో వుండగా చిన్నదైనా ఉమే ధైర్యంతో అత్తగారి సపర్యచేస్తోంది.

ఆఖరు సారిగా అత్తగారికంఠం ధ్వనించింది. అందరు ఆతృతగా వింటుండగా తనని దగ్గరకు రమ్మని తల ఆ అమృతమయహస్తంతో నిమురుతూ "అమ్మా! ఉమా! కృష్ణకి యిక్కడినుండి నీవు అమ్మవికాని వదినెవుకావు" అంటు ఆయాసంతో మాట్లాడలేక నిట్టూర్పు విడిచింది. తను వినలేక ఘొల్లుమంది. కృష్ణుడు "వదినా" అంటూ ఒళ్ళోకూర్చున్నాడు. అదే ఆఖరుసారిగా అకాల మరణంతో ఆదివ్యజ్యోతి ఆయింటినంధకారంలోముంచి వెళ్ళిపోయింది.

* * *

తల్లిలేని లోటెక్కడ కనపడుతుందోనని ఒక్కక్షణం యేమరకుండా జాగ్రత్తగా పెంచుకొస్తున్నా బలహీనుడుగా తయారౌతున్నాడు. తల్లి జబ్బె పసివాడిని పట్టుకొంది. ఇంతలో తనకి సంతానం కలిగే సూచనలు కనిపించినవి. కృష్ణుడిని మునుపటి మాదిరిగా చూడగలనో లేనోనని గజగజలాడింది.

పుట్టనే పుట్టాడు చంటివాడు. కాని ఉమ చంటిబిడ్డ యేడుస్తున్నా వినిపించుకోక మరిదిని లాలించేది. ఇదేవిషయంలో అనేకమార్లు భార్య భర్తలు తీవ్రంగా వాదించుకున్నారు.

ఒకరోజు ఆఫీసునుంచి యింటికి తిరిగివచ్చిన ఉమ పెనిమిటి చంద్రశేఖరం చంటిబిడ్డ నట్టింట ఆలోపాలోమని యేడుస్తుండటం చూచాడు. భార్యని పిలిచాడు. జవాబురాలేదు, రుద్రుడై పోయేడు. పాపడిని భుజానవేసుకొని యిల్లంతా కలియతిరిగాడు. ఇంతలో వీధిలో యెక్కడో పొర్లుతున్న కృష్ణుణ్ణి చంకనెత్తుకొని ఉమ వచ్చింది. రాగానే నూతిదగ్గరకు తీసుకెళ్ళి మరిదికి స్నానంచేయిస్తోంది.

చంద్రశేఖరానికి ఒళ్లు ఉడికిపోయింది. భార్య మీద పొలికేకలు పెట్టాడు. "ఎద్దులాగున్న వాడికి ఒళ్లురుద్ది పోస్తున్నావ్. చంటిబిడ్డను చూచుకోవేమే గయ్యాళి" అని.

ఉమకి అర్థంకాక బిత్తరిముఖం చూపింది. పరిస్థితి అర్థం చేసుకొంది. చంటివాడి నందుకొని, కృష్ణను తీసికొని నడిచి వెళ్ళిపోయింది. ఇలాటి వెన్ని జరిగినా లెక్కపెట్టేది కాదు.

* * *

ఇద్దరిని లాలించి పెంచుతున్నది. పిల్లలు పెరుగుతున్నారు. అన్నదమ్ములలాగ మసులుతున్న వారిమనస్సులు ఉమ కవగతం కాలేదు, వదినె తనని చంటి వాడిలాగచూస్తూ, అన్నయ్యకంటె తక్కువ చేస్తున్నదని కృష్ణకి వుడుకుబోతుతనం పట్టుకున్నది. ఆత్మోన్నత లోభంతో ఉమ చేసే ప్రతి పనిని విమర్శిస్తున్నాడు. ఆ దృష్టితో చూస్తున్న కృష్ణకు వదినె కేవలం స్వార్థపరురాలుగా తోచింది. ఈ అగ్నిలో ఆజ్యం వేసింది అక్కయ్య ఒకరోజు. ఎంతో ఆప్యాయంగా దగ్గరకు పిల్చి, "ఏంరా తమ్ముడూ! ఆస్తిలో సగం హక్కునీదా, ఇంట్లో నీవు అనామకుడుగా వుండటమేం? అన్నయ్య నడిగి వేరుపడు. రమను నీకిచ్చి పెండ్లిచేస్తా" నని అన్నది.

కృష్ణుడు తిన్నగా అన్నయ్య నలా అడగడానికి తికమకలు పడ్డాడు. అయినా తనకిక ఆ యింట్లో వుండటం చాలా అవమానకరంగా వుంది. తెగించి అన్నయ్యయెదుటె నిల్చొని, "అన్నయ్యా! నా వాటా పంచివేయరా" అన్నాడు.

అలా గడిగినవెంటనే చంద్రశేఖరం, ఉమ యిద్దరు వులిక్కిపడ్డారు. ఏదో దుష్టగ్రహక్రీడ అదని అనుమానపడ్డారు. "నీ యిష్టప్రకారమే సంసారం సాగనీ కాని, విడిపోవ"ద్దని బ్రతిమిలాడారు. దయభయాల నచ్చచెప్పచూచినా, తృణీకరించి యెదురు తిరిగాడు.

ఆరోజు గతించి సంవత్సరమైనా యీ ఇంట్లో అడుగుపెట్టి ఒక్కరోజు ఎరగడు. ఆఖరుకు అన్నదమ్ముల్లాగ పెరిగిన చంటివాడితో నైనా

మాట్లాడి యెరుగడు కాని పెంచిన మమకారం వేధించగా యెన్నోమార్లు పిలిచి ఈ రోజు లాగునే తిరస్కరింపబడింది. కాని యీవేళ మరీ మనస్సు విచలితమైంది.

దానికి తగిన కారణంలేకపోలేదు. వదినె అనాదరణచేసి యిల్లువెళ్లగొట్టిందన్నా ఆమెకు లెక్కలేకపోయింది. కాని అంతకు ముందురోజు వదినెగారింటికి వెళ్లినప్పటినుండి ఆమె మనస్సు కానరాని బాధకులోనైంది, వదినెతో ఉమ, "వదినా! కృష్ణుడి పెళ్లెప్పుడుచేస్తారు? అతను ఒకింటివాడై రమతో కాపురంచేస్తుంటే చూడాలని వున్నది" అన్నది. అప్పటి వదినెగారిజవాబు కొరడాతో కొట్టినట్లు గాయపరచింది. అది స్మృతిపథంలో తారసిల్లినప్పుడల్లా పుండుపుల్లతో కెలికినట్లవుతుంది. "ఆ బలహీనుడికీ, జబ్బుపిల్లవాడికా నా బిడ్డనివ్వడం? నా తమ్ముడైతేమాత్రం కూతురుకంటేనా? ఏమి నంగనాచివమ్మా ఉమాదేవి! అయినంత మట్టుకు ఆస్తికి అధికారిణివి నీవే—అదిచాలక పసికూన రమ గొంతు తేనెపూసినకత్తితో కోయాలని చూస్తున్నావా?" అన్నది. ఆ మాటలకర్థమేమిటి? కృష్ణుడు దక్కడనేనా?

*　　*　　*

మనస్సు మనస్సులోలేదు. కాళ్లు మనస్సుతోటే పరుగెత్తాయి. తిన్నగా కృష్ణుడి గదిలోకి వెళ్లింది. ప్రక్కమీద కండ్లుమూసికొని పడుకొని యేదో యోచిస్తున్నాడు. ఎదురుగా టేబిల్ మీద అలారంటైంపీస్ చేసే టిక్కుటిక్కు శబ్దం మినహా నిశ్శబ్దంగా, నిర్మలంగావుంది. ఆ వాతావరణంలో మరిదినిచూస్తే యోగనిద్రలో మునిగిన మహాతపస్విలాతోచింది. ఉమకు గుండె ఆవేగంతో ఒణుకుతున్నది.

మరిది పసిడిమిసమిసలలో ఏదో అనారోగ్యం స్ఫురిస్తున్నది. ఆ ఆదరరహితశరీరపు బుసబుసలలో అనారోగ్యం మరింత వ్యక్తమౌతున్నది. హృదయస్పందన ఆగలేక, "నాయనా" అంటు తలయెత్తి ఒడిలో పెట్టుకొని నిమరడం ప్రారంభించింది.

"వదిలా" అని కండ్లలోకిచూచి, ఆయాసంగా, "అన్నయ్యేడీ? తమ్ముడు స్కూలుకెళ్లాడా" అని అడిగి "అబ్బా" అని బాధగా మూలిగాడు. ఉమ హృదయం చెప్పనలవికాని అనుభూతిలోవున్నది. మరిది తిరిగి తనతో మాట్లాడినందుకానందం అనుభవించలేక, యీ విషమ పరిస్థితికి రూపెత్తిన విషాదంలా మారింది.

*　　•　　*

ఆఫీసునుండి వచ్చిన చంద్రశేఖరం భార్యా వేళ్ళేటప్పుడింట్లో కనపడక పోవడానికాశ్చర్యపడుతూ ఒకవేళ కృష్ణుడిని భోజనానికి పిలవడానికి వెళ్ళిందేమోనని కృష్ణుడిగది ప్రవేశించి ఆ దృశ్యం చూచి విచలితుడయ్యాడు. ఉమ గుండెలకు తల ఆన్చి కూర్చుని ఆయాసపడుతున్నాడు తమ్ముడు. నిశ్చల దృక్కులతో శిలాప్రతిమలాగ మారిపోయివుంది ఉమ. "కృష్ణా! నాయనా" అంటూ దగ్గిరకెళ్ళిన అన్నయ్యను, "అన్నయ్యా! నన్ను క్షమించండి. వదినెను వదినెగా మాత్రమే చూచి పొరపడ్డాను నేను. కాని వదినె కేవలం పరలోకానికి వెళ్ళిందనుకున్న అమ్మే. నేనూ అమ్మ ఆదరణలో చిరకాలం వుండడానికి ఏ విధంగానూ నోచుకోలేదు. తమ్ముడేడీ? [illegible] చిరకాలం అమ్మ ఒడిలోని సుఖం [illegible]ంచే ప్రాప్తం యిమ్మని యీ ఆఖరు సమయంలో భగవంతుని ప్రార్థిస్తున్నాను." అని మాట్లాడలేక కళ్లు మూసేడు. అదే ఆఖరు శ్వాసయింది. ఆ యిద్దరు కూడ జీవం లేనట్లేవున్నారు.

*　　*　　*

పరామర్శలనే పేరుతో వస్తూ పోతూ, అనేక విధాలుగా మాట్లాడుతున్నారు. వరసైన ఒకావిడ ఉమతో, "ఐతే ఏమో! రెండో వాటాకూడా మీ అనుభవంలోకే వచ్చిందన్న మాట" అని చిలిపిగా నవ్వి కొంటెగా చూచి నిష్క్రమించింది. కాని, హృదయంలో ఆమాట అగ్ని పర్వతాలు బ్రద్దలు చేయించింది. వేయిరైళ్ళొక్కసారి ఢీకొన్నట్లయింది. భూమి పగిలిపోయి పాపాత్ములను తనలోకి తీసికుంటున్నట్లయింది. లోకపుతీరు విస్పష్టంగా తెలియగానే ఉమ అమాయక హృదయంలోని పెంచిన మమకారం దెబ్బతిన్నది. అదే తల్లినైతే అనగలరా?

